క్లుప్తంగా

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



సీఎం సహాయ నిధి చెక్కును బాధితుడికి అందజేస్తున్న ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

బొండపల్లి: మండలంలోని జె.గుమడాం గ్రామానికి చెందిన మంత్రి అర్జునకుమార్ కొద్ది నెలలుగా అనారోగ్యంతో బాధపడుతూ బోడసింగిపేటలో నివాసం ఉంటున్నాడు. వైద్యం కోసం సాయం చేయాలని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్యకు విన్నవించాడు. స్పందించిన ఎమ్మెల్యే సీఎం సహాయ నిధి కోసం దరఖాస్తు చేయించగా రూ.5లక్షలు మంజూరైంది. ఈ మొత్తాన్ని విజయనగరంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో చెక్కు రూపంలో ఎమ్మెల్యే అప్పలనరసయ్య బాధితుడికి గురువారం అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ వేమలి ముత్యాలునాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు మంత్రి గోవింద తదితరులు పాల్గొన్నారు.

బెల్లం ఊట ధ్వంసం



చిన్నమన్నిపాలెం గ్రామ శివారులో బెల్లం ఊటను పారబోస్తున్న పోలీసులు

కొత్తవలస : మండలంలోని రామలింగాపురం, చిన్నమన్నిపాలెం గ్రామాల సమీపంలో రహస్యంగా నిర్వహిస్తున్న సారా తయారీ శిబిరాలపై సీఐ ఎస్.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పోలీసులు గురువారం దాడులు చేశారు. రామలింగాపురం గ్రామ సమీపంలో నిర్వహించిన దాడుల్లో సుమారు వెయ్యి లీటర్లు, చిన్నమన్నిపాలెం గ్రామ సమీపంలో నిర్వహించిన దాడుల్లో సుమారు 800 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్టు సీఐ తెలిపారు. తయారీదారులు తప్పించుకు పారిపోయారని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

గజపతినగరం : ఇంటర్మీడియెట్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.ప్రకాష్‌రావుపట్నాయక్ తెలిపారు. శుక్రవారం నుంచి పరీక్షలు జరగనున్న నేపథ్యంలో పరీక్ష కేంద్రాల్లో మౌలిక సదుపాయాల ఏర్పాట్లును ఆయన గురువారం పరిశీలించారు. ప్రతి పరీక్ష కేంద్రంలో సీసీ కెమెరాలతో పాటు విద్యుత్, తాగునీరు తదితర ఏర్పాట్లు చేసినట్టు చెప్పారు.

లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు



అభిషేకాలతో స్వామివారు

జామి: మండలంలోని కుమరాం ఐశ్వర్య లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గురువారం స్వాతి నక్షత్రం సందర్భంగా స్వామివారికి పంచామృతాభిషేకాలు గావించారు. ఆలయ ప్రధాన అర్చకులు వరప్రసాద్ ఆచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

పేదలకు బియ్యం పంపిణీ



పేదలకు బియ్యం పంపిణీ చేస్తున్న క్లబ్ సభ్యులు

జామి: భీమసింగి వసంతివాసవి క్లబ్ ఆధ్వర్యంలో గురువారం పీతపాలెం గ్రామంలో పేదలకు ఉచితంగా బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వాసవి క్లబ్ రీజనల్ చైర్మన్ వాకచర్ల భాస్కరరావు మాట్లాడుతూ తమ క్లబ్ ఆధ్వర్యంలో పేదలకు సేవాకార్యక్రమాలు అందించడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు సీహెచ్.రాంబాబు, కార్యదర్శి కె.రవి, నరేష్ పలువురు సభ్యులు పాల్గొన్నారు.

నేడు రావివలసలో 'గడప గడపకు..'

చీపురుపల్లి: మండలంలోని రావివలస సచివాలయం పరిధిలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ డి.శ్వేత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4 గంటలకు ప్రారంభం కానున్న ఈ కార్యక్రమానికి జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ హాజరు కానున్నట్టు తెలిపారు. అన్నిశాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

అభివృద్ధి పథంలో గజపతినగరం

- రూ.20కోట్లతో రెండు బ్రిడ్జిల నిర్మాణం
- రూ.53.50కోట్లతో గ్రామీణ రహదారులకు శ్రీకారం
- లబ్ధిదారుల ఖాతాల్లో రూ.51.52కోట్ల జమ
- రూ.17కోట్లతో వంద పడకల ఆస్పత్రి నిర్మాణ పనులు



బూడిపేట గ్రామంలో వేసిన సీసీ రోడ్డు



గజపతినగరంలో వెల్‌నెస్ సెంటర్



గజపతినగరం గ్రామ సచివాలయం



నాడు - నేడులో అభివృద్ధి చేసిన గజపతినగరం ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాల

గజపతినగరం: రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక గజపతినగరం అభివృద్ధి పథంలో దూసుకుపోతోంది. ప్రజల కనీస అవసరాలు తీరడంతో పాటు మౌలిక సదుపాయాలు సమృద్ధిగా సమకూరుతున్నాయి. దీంతో చాలా వరకు ప్రజా సమస్యలు పరిష్కారమయ్యాయి. రూ.4కోట్లతో పట్రువాడ బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడంతో చంపావతి నదిలో కాలినడక కష్టాలు తీరాయి. గజపతినగరం జాతీయ రహదారి వద్ద రూ.16కోట్లతో బ్రిడ్జి ఏర్పాటు చేశారు. గజపతినగరం జాతీయ రహదారి నుంచి దత్తిరాజేరు మండలం పోరలి వరకు రూ.45కోట్ల న్యూడెవలప్‌మెంట్ బ్యాంకు (ఎన్‌డీబీ) నిధులతో 42 కల్వర్టుల, ఆరు మైనరు బ్రిడ్జిలు, రెండు మేజరు బ్రిడ్జిలు, రోడ్డు విస్తరణ పనులు, సీసీ డ్రైనేజీలు, బైపాస్ రోడ్డు నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి.

రూ.14లక్షల 29 వేల 318లతో నాడు - నేడు పనులు పూర్తి చేసి స్థానిక ఎస్సీ కాలనీ పాఠశాలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దారు. రూ.17కోట్లతో 30 పడకల ఏరియా ఆస్పత్రిని వంద పడకల ఆస్పత్రిగా స్థాయి పెంచి చర్యలు తీసుకుంది. మండల కేంద్రంలోని రెండు సచివాలయాల పరిధిలో గ్రామాల్లో సీసీ రోడ్లు, కాలువలు, నాడు - నేడుతో అన్ని రకాల అభివృద్ధి కార్యక్రమాలను ప్రభుత్వం చేపట్టడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో సచివాలయాలతో పాటు రైతుభరోసా, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేసి ప్రజలకు సంపూర్ణ సేవలు అందిస్తున్నారు.

ప్రజల ఖాతాల్లోకి రూ.51.52కోట్లు



గజపతినగరం రైతుభరోసా కేంద్రం

గజపతినగరంలో రెండు గ్రామ సచివాలయాల పరిధిలో ఉన్న వివిధ గ్రామాల ప్రజలకు 51 కోట్ల 52 లక్షల 7వేల 534 రూపాయలు నేరుగా వివిధ పథకాల రూపంలో నగదును వైఎస్సార్ సీపీ ప్రభుత్వం జమ చేసింది.

ప్రభుత్వ పథకాల వల్ల లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసిన నగదు వివరాలు...

పథకం	లబ్ధిదారులు	నగదు
జగనన్న అమ్మ ఒడి	840	రూ.21,74,88,304
జగనన్న విద్యాదీవెన	669	రూ.14,683,787
జగనన్న వసతి దీవెన	511	రూ.78,95,095
వైఎస్సార్ రైతు భరోసా	737	రూ.3,19,37,300
వైఎస్సార్ ఉచిత పంటల బీమా	176	రూ.2,13,152
వైఎస్సార్ సున్నా వడ్డీ పంట రుణాలు	114	రూ.5,64,09,010
వైఎస్సార్ పెన్షన్ కానుక	1199	రూ.7,03,99,000
వైఎస్సార్ చేయూత	638	రూ.3,94,56,752
వైఎస్సార్ ఆసరా	1647	రూ.5,42,69,476
వైఎస్సార్ ఆరోగ్యశ్రీ	418	రూ.1,05,77,267
హౌసింగ్(నగదు చెల్లింపులు)	380	రూ.3,43,53,636

రూ.35లక్షలతో అభివృద్ధి పనులు



వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత దావాలపేట, బూడిపేట గ్రామాల్లో సుమారు రూ.35లక్షలతో రోడ్లు, కాలువలు, తాగునీటి సరఫరా తదితర అభివృద్ధి పనులు చేపట్టడం జరిగింది.

– బూడి జ్యోతి, బూడిపేట సర్పంచ్

సంతోషంగా ఉంది



సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత మాలాంటి పేద మహిళలకు అనేక సంక్షేమ పథకాలు అందించారు. అందులో భాగంగా నాకు అమ్మ ఒడి పథకంతో పాటు డ్వాక్రా రుణమాఫీ చేయడంతో నేను, నా కుటుంబం సంతోషంగా జీవనం సాగిస్తున్నాం. మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి రావాలి. మా జీవితాలు బాగుంటాయి.

–ఎ.జగదీశ్వరి, లబ్ధిదారు, దావాలపేట

రైతు సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

- ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య



లబ్ధిదారులకు పట్టాలు అందజేస్తున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య, ఆర్డీఓ సూర్యకళ

బొండపల్లి: రైతు సంక్షేమానికి ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తూ అండగా నిలుస్తున్నారని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో విజయనగరం ఆర్డీఓ సూర్యకళతో కలిసి భూసమస్యలకు శాశ్వత పరిష్కారంలో భాగంగా అసైన్‌మెంట్ భూములు లబ్ధిదారులకు యాజమాన్య హక్కులు కల్పిస్తూ పట్టాలను గురువారం అందజేశారు. నవరత్నాలు పేదలందరికీ ఇళ్లల్లో భాగంగా జగనన్న లేఅవుట్లలో ఇళ్ల స్థలాలు ఇచ్చిన పేదలకు ఉచితంగా పట్టాలను రిజిస్ట్రేషన్ చేసి పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా రీసర్వే అయిన ఆరు గ్రామాల్లో అసైన్‌మెంట్ భూములు సాగు చేస్తున్న 52 మంది లబ్ధిదారులైన రైతులకు 30 ఎకరాల 47 సెంట్లు, రీసర్వే కాని ఐదు గ్రామాల్లో 172 మంది లబ్ధిదారులైన రైతులకు 151 ఎకరాల ఆరు సెంట్లు, జగనన్న లేఅవుట్లలో ఇళ్ల స్థలాల లబ్ధిదారులు 1042 మందికి పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల కోసం ఇంతగా ఆలోచించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరేనని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ చల్లా చలంనాయుడు, జెడ్పీటీసీ రాపాక సూర్యప్రకాశరావు, గొట్లాం పీఏసీఎస్ చైర్మన్ మహంతి రమణ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బోద్దల చిన్నంనాయుడు, జేసీఎస్ కన్వీనర్ పల్లి రఘు, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుడు బోడసింగి జగదీశ్వరరావు, నాయకులు ఎం.నారాయణమూర్తిరాజు, మీసాల తులసీరాం, వేంద్రాం సర్పంచ్ కర్రోతు శ్రీనివాసరావు, ఎంపీడీఓ ఎస్.హరిహరరావు, డిప్యూటీ తహసీల్దార్ పి.హరి, సీనియర్ సహాయకులు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పొదుపు సంఘాల సభ్యులు ఆర్థికాభివృద్ధి సాధించాలి

- ఏపీ మహిళా అభివృద్ధి సంస్థ ప్రొగ్రాం కో ఆర్డినేటర్ శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

గంట్యాడ: పొదుపు సంఘాల మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని ఏపీ మహిళా అభివృద్ధి సంస్థ ప్రొగ్రాం కో ఆర్డినేటర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. కొత్తరుబిల్లి గ్రామైఖ్య సంఘం, ధనలక్ష్మి పొదుపు సంఘాలను ఆయన గురువారం పరిశీలించారు. పొదుపు సంఘాల సభ్యులు సమావేశాలు ఏ విధంగా నిర్వహిస్తున్నారు... నిర్వహణ తీరును పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఏపీ మహిళా అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు మేనేజర్ దేవన్ కుమార్, స్త్రీ నిధి డీజీఎం సిద్ధి శ్రీనివాస్, డీఆర్‌డీఏ ఏపీడీ పి.సావిత్రి, ఏజీఎం ఉమా మహేశ్వరావు, డీపీఎంలు జయశ్రీ, బంగారమ్మ, ఏరియా కో ఆర్డినేటర్ ఆదిత్య, ఏపీఎం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ



పేదలకు నిత్యావసరాలు అందజేస్తున్న వాసవీ వనితలు

శృంగవరపుకోట: పట్టణంలోని షిర్డీ సాయిబాబా దేవస్థానంలో గురువారం ఎస్.కోట వాసవీ వనితా క్లబ్ సభ్యులు నిరుపేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. సేవ వాసవీ క్లబ్‌ల ప్రధాన ఉద్దేశమని క్లబ్ అధ్యక్షురాలు కె.కల్యాణి చెప్పారు. ఇంటర్నేషనల్ క్లబ్ ఆదేశాల మేరకు నాలుగేళ్లకు ఒకసారి వచ్చే లీపు సంవత్సరమైన ఫిబ్రవరి 29న సేవా కార్యక్రమాలు నిర్వహించటం ఒక ఆనవాయితీగా పాటిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వాసవీ వనితలు ఎ.రత్నావతి, బాలనాగు శ్రీనివాస్, హరీష్‌కుమార్, కె.పుష్పరాణి, వి.సుశీల తదితరులు పాల్గొన్నారు.

అదానీ పవర్ ప్లాంట్‌ను అడ్డుకుంటాం...

వేపాడ: మండలంలోని కరకవలస పంచాయతీ మారిక గ్రామంలో అదానీ గ్రీన్ పవర్ ప్లాంట్ నిర్మిస్తే గిరిజనులు ఉపాధి కోల్పోతారని దాన్ని అడ్డుకుంటామని ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా జగన్ అన్నారు. ఆయన ఆధ్వర్యంలో గిరిజనులు గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాతమారిక, కొత్త మారిక గ్రామాల్లో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న గిరిజనుల భూములు నాశనం అవుతాయన్నారు. ప్లాంట్ నిర్మాణానికి సర్వే నిర్వహస్తున్నారని రైతు సంఘం నాయకులు తెలిపారు. ప్లాంట్‌ను అడ్డుకోవడానికి గిరిజనులు ఐక్యతతో పోరాడాలన్నారు. కార్యక్రమంలో కిలో ఆనంద్, గెమ్మెల రామకృష్ణ బాబూరావు, అప్పలనాయుడు, వెంకటరావు, ఆశు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జాతిపిత కలలను సాకారం చేసిన సీఎం జగన్



రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

- ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు
- పోతంపేట గ్రామంలో సచివాలయం, ఆర్‌బీకేల ప్రారంభం

లక్కవరపుకోట : జాతిపిత మహాత్మాగాంధీ కలలను సాకారం చేసిన గొప్ప వ్యక్తి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. పోతంపేట గ్రామంలో సుమారు రూ.75లక్షలతో నిర్మించిన సచివాలయ భవనం, రైతు భరోసా కేంద్రం భవనాలను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో ఒక పంచాయతీకి భవనం కావాలన్నా.. శిథిలావస్థకు చేరుకున్న పాఠశాలకు కొత్త భవనం కావాలన్నా... జెడ్పీ కార్యాలయం చుట్టూ తిరిగినా ప్రయోజనం ఉండేది కాదని... ప్రస్తుతం ఆ పరిస్థితులకు భిన్నంగా అన్ని గ్రామాల్లో ప్రజల కోసం అవసరమైన భవనాలను ప్రభుత్వం వెంటవెంటనే నిర్మిస్తుందన్నారు. గ్రామాభివృద్ధితోనే దేశాభివృద్ధి ముడిపడి ఉంటుందన్న సత్యాన్ని నమ్మిన వ్యక్తి సీఎం జగన్ అని చెప్పారు. రాష్ట్రంలో శరవేగంగా జరుగుతున్న అభివృద్ధిని చూసి ప్రతిపక్షాలకు నిద్ర పట్టడం లేదన్నారు. అన్ని వర్గాల సంక్షేమానికి పాటు పడుతున్న వ్యక్తి సీఎం జగన్ అన్నారు. రానున్న ఎన్నికల్లో మరోసారి జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాల్సిన అవసరం మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు, మండల పార్టీ అధ్యక్షుడు గుమ్మడి సత్యనారాయణ, ఎంపీటీసీ భూమిరెడ్డి స్వామినాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు బోకం అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమి పూజ



పూజ కార్యక్రమంలో పాల్గొన్న బొత్స గురునాయుడు

దత్తిరాజేరు: మండలంలోని టి భూర్జవలస గ్రామంలో ఉమారామలింగేశ్వరస్వామి ఆలయానికి గ్రామ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో గురువారం ఉదయం భూమి పూజ జరిగింది. శారద పీఠం వ్యవస్థాపకుడు అంపోలు రుద్ర కోటేశ్వరరావు పర్యవేక్షణలో గ్రామ పురోహితులు మధుసూదనశర్మ మంత్రోచ్చరణ మధ్య 9.57 నిమిషాలకు శంకుస్థాపన కార్యక్రమం జరిగింది. పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య కుమారుడు బొత్స గురునాయుడు పాల్గొన్నారు. అనంతరం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మంత్రి అప్పలనాయుడు మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య టీటీడీ నుంచి రూ.10లక్షలు మంజూరు చేయించడంతో పాటు దాతలు సహకారంతో నిర్మాణం చేపట్టడం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రౌతు రాజేశ్వరి, సర్పంచ్ మంత్రి క్రాంతికుమార్, గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ బెజవాడ రాజేశ్వరి పలు గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

6న మండల సమావేశం

దత్తిరాజేరు: మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 6న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ చంద్రకుమారి గురువారం తెలిపారు. ఎంపీపీ గేదెల సింహాద్రి అప్పలనాయుడు అధ్యక్షతన జరిగే సమావేశానికి ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య హాజరు కానున్నట్టు పేర్కొన్నారు. సభ్యులు హాజరు కావాలని కోరారు. అన్ని శాఖల అధికారులు సంబంధిత శాఖలకు చెందిన పూర్తి సమాచారంతో హాజరు కావాలని ఎంపీడీఓ కోరారు.

సచివాలయ, ఆర్‌బీకే కేంద్రాల ప్రారంభోత్సవం రేపు

చీపురుపల్లి రూరల్ (గరివిడి): గరివిడి మండలంలోని దువ్వాం, దేవాడ పంచాయతీల్లో ఈ నెల 2న సచివాలయం, రైతు భరోసా కేంద్రాలను రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ప్రారంభించనున్నట్టు ఎంపీపీ మీసాల విజయలక్ష్మి, ఏఎంసీ మాజీ చైర్మన్ మీసాల విశ్వేశ్వరరావు గురువారం తెలిపారు. మార్చి 2న మధ్యాహ్నం 3 గంటల నుంచి దువ్వాం గ్రామంలో, దేవాడ గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతాయన్నారు. పార్టీ శ్రేణులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

'స్నేహ' వార్షికోత్సవం

శృంగవరపుకోట : పట్టణంలోని స్నేహ స్వచ్ఛంద సేవా సంస్థ 13వ వార్షికోత్సవ వేడుకలు బుధవారం రాత్రి స్థానిక జూనియర్ కళాశాల ప్రాంగణంలో సంస్థ అధ్యక్షుడు ఎ.ఎస్.వెంకటరావు నేతృత్వంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వేర్వేరు విభాగాల్లో అత్యంత ప్రతిభ కనబరిచిన మహిళలు డా.ఎ.ధరణి, టీచర్ ఎస్.అప్పయ్యమ్మ, లెక్చరర్ బి.లక్ష్మి, సి.హెచ్.ఓ బి.రాధారాణి, యోగా ఇన్‌స్ట్రక్టర్ జి.రుచిత, కరాటే క్రీడాకారిణి షేక్ తానీషాలను ఘనంగా సన్మానించారు. షేక్ తానీషా కరాటే ప్రదర్శనకు ముగ్ధులైన ఎం.భాస్కరరావు ఆమెకు రూ.5116లు అందించి భవిష్యత్‌లో కరాటే సాధనకు అండగా ఉంటానన్నారు. స్నేహ ప్రతిభ పరీక్షల్లో ప్రతిభ చాటిన వారికి, యోగా ప్రదర్శన చేసిన విద్యార్థులకు, సన్మాన గ్రహీతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి ఎం.సుబ్బారావు, ఉపాధ్యక్షుడు బి.వెంకటేశ్వరరావు, సంస్థ సభ్యులు, ఉపాధ్యాయులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ పేదవాడికి సొంతిల్లు

- సీఎం జగన్‌తోనే సాధ్యపడింది
- ఎమ్మెల్యే బొత్స



పట్టాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

గజపతినగరం రూరల్:

అర్హులైన ప్రతీ పేదవాడికి సొంతిల్లు అందించిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యపడిందని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో నవరత్నాలు – పేదలందరికి ఇళ్లు కార్యక్రమంలో భాగంగా గజపతినగరం మండలానికి సంబంధించి 994, దత్తిరాజేరు మండలానికి సంబంధించి 91పట్టాలను అర్హులైన వారందరికి గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలకతీతంగా గడిచిన నాలుగున్నరేళ్లలో అర్హులైన వారందరికి పథకాలను మంజూరు చేసిన ఏకైక ప్రభుత్వం జగన్‌మోహన్‌రెడ్డిదేనని పేర్కొన్నారు. రాష్ట్రంలో మౌలిక సదుపాయాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. గత ప్రభుత్వ పాలనలో అభివృద్ధి శూన్యమని, అభివృద్ధి పేరుతో నిధులను బొక్కేసి, ప్రజలను మోసం చేసిన టీడీపీ నాయకుల్ని మళ్లీ నమ్మితే మోసపోవడం ఖాయమన్నారు. ప్రస్తుత సంక్షేమ పథకాలను మళ్లీ మళ్లీ ప్రతీ ఒక్కరూ పొందాలంటే జగన్‌మోహన్‌రెడ్డికే ఓటు వేసి ముఖ్యమంత్రిని చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం అర్హులైన వారందరికి పట్టాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గజపతినగరం, దత్తిరాజేరు జెడ్పీటీసీలు గార తవుడు, రౌతు రాజేశ్వరి, ఎంపీపీ గేదెల సింహాద్రి అప్పలనాయుడు, బెల్లాన జ్ఞానదీపిక, ఎంపీడీఓ జయంత్ ప్రసాద్, తహసీల్దార్ రమేష్, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు మండల సురేష్, కరణం ఆదినారాయణ, వైస్ ఎంపీపీ కర్రి దేవితో పాటు గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

తువ్వాళ్ల పంపిణీ

చీపురుపల్లి రూరల్(గరివిడి):



తువ్వాళ్లను అందజేస్తున్న సర్పంచ్, ఎంపీటీసీ

గరివిడి మండలంలోని అర్తమూరు గ్రామంలో పలువురు పేదలకు, చిన్నారులకు తువ్వాళ్లను పంపిణీ చేశారు. గ్రామంలో శ్రీవిజయగౌరి యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ పొన్నాడ కుమార్, ఎంపీటీసీ పతివాడ గురునాయుడు వీటిని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువజన సేవా సంఘాలు ఏర్పాటు చేసి స్వచ్ఛంద సేవా కార్యక్రమాలను నిర్వహించటం చాలా మంచి ఆలోచనని కొనియాడారు. యువజన సేవా సంఘం ప్రెసిడెంటు పిల్లా సుధాకర్, రిటైర్డు ఉపాధ్యాయుడు గంగుపల్లి సత్యనారాయణ, రంగబాబు తదితరులు పాల్గొన్నారు.

